

ఏయూకు జియో స్పేషియల్ అవార్డు

- దేశంలో ఈ అవార్డు దక్కించుకున్న నాలుగు వర్సిటీల్లో ఒకటి...
- విభాగ అభివృద్ధికి చేసిన కృషిచేసిన ప్రొఫెసర్ వజీర్‌కు జ్యూరీ అవార్డు



ప్రొఫెసర్ వజీర్ మహ్మద్‌ను అభినందిస్తున్న వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం మరో ప్రతిష్ఠాత్మకమైన అవార్డును దక్కించుకుంది. జియో స్పేషియల్ (భూ స్థితి సంబంధిత) రంగంలో నూతన ఆవిష్కరణలు, వినూత్నమైన పరిశోధనలు, పీహెచ్‌డీలు, వర్క్‌షాప్‌లు, డ్రోన్ టెక్నాలజీ ప్రోగ్రామ్స్, సెమినార్స్ వంటివి నిర్వహిస్తున్నందుకుగాను వర్సిటీ ఈ అవార్డు దక్కించుకుంది. జాతీయ స్థాయిలో ఈ కేటగిరీ అవార్డును నాలుగు వర్సిటీలు/విద్యా సంస్థలకు ఇవ్వగా, అందులో ఏయూ ఒకటి కావడం విశేషం. ఈ అవార్డును ఈ నెల 17న ఐటీసీ ముంబైలో ఓపెన్ స్పేస్ జీఐఎస్ సెలబ్రేషన్స్ పేరుతో నిర్వహించిన వేడుకల్లో ఇస్రో మాజీ ఛైర్మన్, స్పేస్ కమిషన్ మెంబర్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా వర్సిటీ అధికారులు అందుకున్నారు. అలాగే, మరో కేటగిరీలో వర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ అవార్డును అందుకున్నారు. జియో ఇంజనీరింగ్, రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ కేంద్రం పూర్వ విభాగాధిపతి ప్రొఫెసర్ వజీర్ మహ్మద్ జియో స్పేషియల్ ఫ్యాకల్టీ కేటగిరీలో జ్యూరీ అవార్డును దక్కించుకున్నారు. ఈ అవార్డును దక్కించుకున్న రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏకైక వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. ఈ

... మిగతా 6వ పేజీలో

స్పా ముసుగులో వ్యభిచారం!



- టాస్క్ ఫోర్స్ దాడితో రెండు కేంద్రాల గుట్టురట్టు
- పట్టుబడిన విటులు... నిర్వాహకులపై కేసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని కొన్ని స్పా సెంటర్లు వ్యభిచార గృహాలుగా మారిపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెల్‌నెస్, మసాజ్ పేరుతో బోర్డులు పెట్టి, లోపల చీకటి వ్యవహారాలు నడుపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈనెల 17, 18 తేదీల్లో రెండు స్పా సెంటర్‌లపై దాడి చేయగా అక్కడ వ్యభిచారం జరుగుతున్నట్టు తేలింది. దీంతో నిర్వాహకులపై కేసులు పెట్టారు.



ద్వారకానగర్ మొదటిలైన్‌లోని లావిస్ స్పాలో పోలీసుల తనిఖీలు (ఫైల్ ఫొటో)

- నగరంలోని పలు మసాజ్ సెంటర్లలో చీకటి కార్యకలాపాలు
- నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్‌లు
- పోలీసులకు నెలవారీ మామూళ్లు

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 300కిపైగా మసాజ్ సెంటర్‌లు ఉన్నాయి. వీటిలో కొన్ని చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నాయి. బ్యూటీషియన్ అండ్ కాస్మోటిక్ యాక్ట్‌ను ఉల్లంఘించి తమ సెంటర్లలో అందించే సేవలకు పోలీసుల నుంచి ఆటంకం లేకుండా ఉండేందుకు నెలవారీ మామూళ్లు ముట్టజెపుతున్నాయి. స్పాల్లో అందజేసే సేవలను బట్టి ఈ మామూళ్లు నిర్ణయించడంతోపాటు వసూలుచేసి పోలీసులకు అప్పగించే బాధ్యతను కూడా కొన్ని సెంటర్ల నిర్వాహకులే తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. క్రాస్ మసాజ్‌లు చేసే సెంటర్లు అయితే నెలకు రూ.పది వేలు, అదే వ్యభిచారం అనుమతించే స్పా సెంటర్లు అయితే రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ మామూళ్లు అందజేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

శారీరకంగా అలసిపోయిన వారికి, కండరాల బిగుసుకుపోయే సమస్యతో బాధపడుతున్న వారికి వాటి నుంచి ఉపశమనం కలిగించడంతోపాటు కాస్మోటిక్స్ (అందానికి)కు సంబంధించిన సేవలు మాత్రమే 'స్పా'లు, వెల్‌నెస్ సెంటర్స్‌లో అందించాలి. ఇవన్నీ 'బ్యూటీషియన్ అండ్ కాస్మోటిక్' రంగం కింద గుర్తించబడతాయి. స్పా, మసాజ్ సెంటర్‌లు, రిలాక్స్ సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్స్ వంటి పేర్లతో ఇవన్నీ కార్యకలాపాలు సాగిస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఇలాంటి వాటిలో క్రాస్ జెండర్ (మగవారికి ఆడవాళ్లు, ఆడవారికి మగవారు) మసాజ్ చేయడాన్ని చట్టం అనుమతించదు. మసాజ్ సెంటర్/స్పాలో చీకటి కార్యకలాపాలకు తావులేకుండా ఉండేందుకు పురుషులకు, మహిళలకు వేర్వేరు సెక్షన్లు ఏర్పాటుచేయాలని చట్టంలో పేర్కొన్నారు. స్పాల్లోకి వెళ్లేవారికి ఒక మార్గం, బయటకు వచ్చేవారికి మరొక మార్గం వేర్వేరుగా అందుబాటులో ఉంచాలి. పురుషులకు, మహిళలకు టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు కూడా వేర్వేరుగా ఏర్పాటుచేయాలి. స్పా/మసాజ్ సెంటర్లలో ఒక గది నుంచి మరొక గదిలోకి వెళ్లేందుకు అంతర్గత ద్వారాలు ఉండకూడదు. పది మంది కంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్నట్టయితే వారందరికీ గుర్తింపుకార్డులు ఇవ్వడం, మహిళా సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ విభాగం వంటివి అందుబాటులో ఉంచాలి. మసాజ్ సెంటర్/స్పాలో ఫిజియోథెరపిస్ట్ లేదా ఆక్యుప్రెజర్ లేదా ఆక్యుపేషనల్ థెరపీలో డిగ్రీ, డిప్లొమో లేదంటే సర్టిఫికెట్ కోర్సు చేసిన వాళ్లను మాత్రమే నియమించుకోవాలి. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మాత్రమే తెరిచి ఉంచాలి. అలాగే సెంటర్‌కు వచ్చే వినియోగదారులకు అందించే సేవలను వీడియో రికార్డు చేసేలా అన్నిచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. కనీసం మూడు నెలల ఫుటేజీ స్టోరేజీ ఉండేలా హార్డ్‌డిస్క్‌ను ఏర్పాటుచేసుకోవాలి. కానీ నగరంలోని మసాజ్‌సెంటర్/స్పాల్లో మాత్రం ఈ నిబంధనలేవీ మచ్చుకైనా అమలు కావడం లేదనేది బహిరంగ రహస్యం.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

నగరంలోని మసాజ్ సెంటర్‌లు/స్పాల్లో కొన్నింటిలో మినహా మిగిలిన

... మిగతా 6వ పేజీలో



సిద్ధమైన డబుల్ డెక్కర్

డబుల్ డెక్కర్ ట్రయల్ రన్

- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- ఆర్‌కే బీచ్ నుంచి తొట్లకొండ వరకూ...
- మొత్తం 11 బస్టాపులు
- ఒకే టికెట్‌తో 24 గంటల పాటు ఎన్నిసార్లయినా తిరగొచ్చు
- బస్సు ఎక్కడుందో తెలుసుకొనేలా క్యూఆర్ కోడ్
- త్వరలో ఓపెన్ టాప్ బస్సు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో పర్యాటక శాఖ ప్రారంభించనున్న డబుల్ డెక్కర్ (హాప్ ఆన్ హాప్ ఆఫ్) బస్సులు బీచ్ రోడ్డులో చక్కర్లు కొడుతున్నాయి. గమ్యస్థానం చేరడానికి ఎంత సమయం పడుతుందీ, ఏమైనా అడ్డంకులు ఉన్నాయా? అనే విషయాలు తెలుసుకోవడానికి ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు.

విశాఖపట్నం పోర్టు ఇచ్చిన సామాజిక సేవ నిధులతో పర్యాటక శాఖ అధికారులు రెండు బస్సులను కొనుగోలు చేశారు. ఇవి ఎలక్ట్రిక్ వాహనాలు. పర్యావరణ హితంగా ఉంటాయని ఈ-బస్సులు తీసుకున్నారు. వీటికి చార్జింగ్ చేయడానికి అనువైన ప్రాంతం కోసం అన్వేషించి చివరకు సాగర్‌నగర్‌లో ఇస్కాన్ ఆలయం పక్కనే పాయింట్ పెట్టారు. బస్సులను ప్రస్తుతం అక్కడే ఉంచుతున్నారు.

ఎలా నడుపుతారంటే..?



డబుల్ డెక్కర్ బస్సులో సీట్లు

ఈ బస్సులను రామకృష్ణా బీచ్ నుంచి తొట్లకొండ ఆర్చి వరకు నడుపుతారు. ఈ మార్గంలో మొత్తం 11 బస్టాపులు ఉంటాయి. ఎక్కడైనా ఎక్కొచ్చు. ఎక్కడైనా దిగొచ్చు. ఒకసారి టికెట్ తీసుకుంటే 24 గంటలు చెల్లుబాటు అవుతుంది. బస్సులో టూరిస్ట్ గైడ్ ఉంటారు. ఏయే ప్రాంతాల్లో ఏమేమి చూడవచ్చునో వివరిస్తారు. ఈ రెండు బస్సులు ఆర్‌కే బీచ్-తొట్లకొండ మధ్య షటిల్ సర్వీసుల్లా నడుస్తాయి. పర్యాటకులు టికెట్ తీసుకొని ఆర్‌కే బీచ్‌లో కురుసుర, టీయూ-142, సీహ్యారియర్ అన్నీ తాపీగా చూసుకోవచ్చు. ఇంతలో బస్సు వస్తుంది. అందులో ఎక్కి రుషికొండ బీచ్‌లో దిగి అక్కడ బోటు షికార్లు చేసుకోవచ్చు. ఆ తరువాత మళ్లీ బస్సు ఎక్కి తొట్లకొండ వెళ్లొచ్చు. అవన్నీ చూశాక రిటర్న్‌లో ఎక్కడ కావాలంటే అక్కడ దిగొచ్చు. ఒకే టిక్కెట్‌తో

... మిగతా 6వ పేజీలో

ఉత్సాహంగా తలసేమియా రన్



తలసేమియా బాధిత చిన్నారులకు అండగా ఉండేందుకు, వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆర్కే బీచ్‌రోడ్డులో నిర్వహించిన తలసేమియా రన్ విజయవంతమైంది. 3 కె, 5 కె, 10 కె కేటగిరీల్లో నిర్వహించిన ఈ రన్‌లో ఔత్సాహికులైన నగరవాసులు, క్రీడాకారులు, అథ్లెట్లు వందలాది మంది పాల్గొన్నారు. ఈ రన్‌ను ఎన్‌టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి, వెటరన్ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి, హోంమంత్రి వంగలపూడి అనిత, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్, నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ తదితరులు జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. రన్ ముగిసిన అనంతరం తమన్ మ్యూజికల్ నైట్ జరిగింది. - వివరాలు మెయిన్‌లో



వేదికపై నుంచి అభివాదం చేస్తున్న ఎన్‌టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి, వెటరన్ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్.

ఐటీసీ గోదాము దగ్ధం



దగ్ధమవుతున్న సరుకులు

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గండిగుండం-రామవరం రహదారిలో గల ఐటీసీ కంపెనీకి చెందిన గోదాములో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నిత్యావసర సరుకులన్నీ దగ్ధం కావడంతో ఆస్తి నష్టం రూ.కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. - వివరాలు మెయిన్‌లో



మంటల్లో గోదాము

రేషన్ డీలర్ల ఇష్టారాజ్యం

- ఉండాల్సిన చోట కాకుండా వేరొక చోట నిర్వహణ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్డుదారులు

- తమ డిపోలో కాకుండా సమీపంలో ఉన్న మరో డిపోలో బియ్యం, పంచదార తీసుకోవలసిన పరిస్థితి
- నేతలు, సంఘాల ప్రతినిధుల అండదండలతో అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న కొంతమంది డీలర్లు



ఒకే ప్రాంగణంలో రెండు డిపోలు

విశాఖపట్నం/అక్కయ్యపాలెం/మహారాణిపేట (ఆంధ్రజ్యోతి):

ముస్లింతాటిచెట్లపాలెం ప్రాంతంలో ఉంటున్న కార్డుదారులకు సంబంధించి రేషన్ డిపో (నంబరు 0387033) సంఘం ఆఫీస్ జంక్షన్ ఎదురు రోడ్డులో అమ్మవారి గుడి వద్ద ఉంది. అలాగే జగ్గారావు బ్రిడ్జి సమీపంలో ఉండాల్సిన రేషన్ డిపో (నంబరు 0387014) శంకరమఠం రోడ్డులో ఉంది. ఎన్జీవో కాలనీలో నిర్వహించాల్సిన డిపో (నంబర్ 0387015) కూడా అదే ప్రాంగణంలో ఉంది. రేషన్ డిపోలు దూరంగా ఉండడంపై కార్డుదారులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సచివాలయాలు/క్లస్టర్‌కు అనుసంధానం చేసిన చోట కాకుండా మరోచోట డిపోల నిర్వహణతో కార్డుదారులు అసౌకర్యానికి

... మిగతా 6వ పేజీలో

6న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ నూతన స్టాండింగ్ కమిటీ ఎన్నిక వచ్చే నెల ఆరో తేదీన నిర్వహించాలని అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుత స్టాండింగ్ కమిటీ కాలపరిమితి అదే రోజుతో ముగుస్తుంది. ఏడో తేదీనాటికి కొత్త కమిటీ ఎన్నిక పూర్తికావాల్సి ఉంటుంది. దీంతో వచ్చే నెల ఆరున కొత్త కమిటీకి ఎన్నిక పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌తో ఇప్పటికే అధికారులు చర్చించగా, వారంతా సమ్మతించినట్టు తెలిసింది. జీవీఎంసీ పాలకవర్గం వచ్చే ఏడాది మార్చి పదితో ముగియనుండడంతో కొత్తగా ఎన్నికయ్యే స్టాండింగ్ కమిటీ కాలపరిమితి కూడా ఏడునెలలు మాత్రమే ఉంటుంది.

96.36 శాతం కార్డుదారులకు రేషన్ సరకుల పంపిణీ

- జిల్లా పౌర సరఫరాల అధికారి వి.భాస్కర్

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో 641 రేషన్ డిపోల ద్వారా 5,05,886 మంది కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేశామని పౌర సరఫరాల అధికారి

... మిగతా 6వ పేజీలో

రూ.14 కోట్లతో కన్వెన్షన్ సెంటర్లు

- ఎండాడ, చీమలాపల్లిల్లో నిర్మాణం
- ఒకటి పూర్తి, ఆగస్టులో ప్రారంభించేందుకు సన్నాహాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగరాభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) శివారు ప్రాంత ప్రజలకు ఉపయోగపడేందుకు నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్లు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. మొత్తం రూ.17.34 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనాలకు విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులనుంచి రూ.4 కోట్లు మంజూరు కాగా మిగిలిన మొత్తాన్ని వీఎంఆర్‌డీఏ సమకూర్చింది.

- ఎంపీ లాడ్స్ నుంచి రెండేసి కోట్లు
- మిగిలిన మొత్తం వీఎంఆర్‌డీఏ నుంచి కేటాయింపు



పెందుర్తి మండలం చీమలాపల్లిలో కన్వెన్షన్ సెంటర్



ఎండాడలో కన్వెన్షన్ సెంటర్

ఎండాడలో స్థానిక ప్రజలు శుభ కార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి 846 చ.మీ. విస్తీర్ణం కలిగిన స్థలంలో గ్రౌండ్+మొదటి అంతస్థు కలిగిన భవన నిర్మాణానికి రూ.9.5 కోట్లు కేటాయించారు. ఇందులో ఎంపీ లాడ్స్ నుంచి రూ.2 కోట్లు రాగా మిగిలిన 7.5 కోట్లు వీఎంఆర్‌డీఏ వెచ్చిస్తోంది. ఈ స్థలంలో కింద 9,450 చ.అ., మొదటి అంతస్థులో మరో 9,450 చ.అ. కలిపి మొత్తం 18,900 చ.అ. వినియోగ స్థలం ఉండేలా నిర్మాణం చేపట్టారు. ఒక్కో దాంట్లో 500 మందితో కార్యక్రమం నిర్వహించుకోవచ్చు. ఈ నిర్మాణానికి అవసరమైన స్థలం అభివృద్ధికే రూ.1.49 కోట్లు ఖర్చు చేశారు. భవనం పనులకు రూ.3.22 కోట్లు, ఎలక్ట్రికల్ సౌకర్యాలకు రూ.56 లక్షలు, మొదటి అంతస్థులో ఏసీలకు రూ.91 లక్షలు, ల్యాండ్ స్కేపింగ్‌కు రూ.5 లక్షలు కేటాయించారు. ఇవికాకుండా లిఫ్ట్ కోసం రూ.21.60 లక్షలు, బీటీ

... మిగతా 6వ పేజీలో



సత్కారం పొందిన ఎన్‌జీఓలు, పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు



ఆనందపురం మండలంలోని బీపీపీ కళ్లాలు పంచాయతీలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



భీమునిపట్నంలోని ఎగువపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది

పర్యావరణాన్ని కాపాడుకుందాం

- ప్రజా సహకారంతోనే అది సాధ్యం
- సింగిల్ యూజ్డ్ కవర్లతో ఎన్నో అనర్థాలు
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆనందపురం జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం బిపివి కళ్లాలు పంచాయతీలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటి కార్యక్రమాల నిర్వహణకు యువత ముందుకు రావాలన్నారు. అనంతరం రామాలయం పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను అక్కడ యువతకు అప్పగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన లక్ష్మి, నాయకులు తాట్రాజు అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, బంటుపల్లి శ్రీను, గోవింద్, కాకర రమణ, పాండ్రంకి అప్పలరాజు, బమ్మిడి తారక్, సురాల సత్యవరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదో వార్డులో...

ఎండాడ : నగరంలో పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న ట్రిబుల్ ఆర్ సెంటర్ ఆవరణలో జీవీఎంసీ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు కాలువల్లో, గెడ్డల్లో చేరి వర్షాల సమయంలో వ్యాధులకు కారణమవుతున్నాయని చెప్పారు. పారిశుధ్య కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి గెడ్డల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వెలికి తీస్తున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి స్వచ్ఛ విశాఖ సాధనకు ప్రజలు సహకరించాలని కోరారు. తొలుత కలెక్టర్ అధికారులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అలాగే లెట్స్ అండ్ ప్లాస్టిక్ పొల్యూషన్ టుగెదర్ అన్న నినాదంతో ఉన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నగరానికి జాతీయ స్థాయిలో సఫాయి మిత్రా సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానానికి కృషి చేసిన పారిశుధ్య కార్మికులు, ఎన్‌జీఓల ప్రతినిధులను కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వీ నరేశ్‌కుమార్, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం సత్యవేణి, జెడ్సీ కనక మహాలక్ష్మీ, సహాయక వైద్యాధికారి డాక్టర్ కిశోర్, కూటమి నాయకులు నొడగల అప్పారావు, శాఖరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం రూరల్ : మండలంలో పాలిథిన్ కవర్ల నిషేధానికి పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీఓ ఎం. విజయ్ కుమార్ కోరారు. శనివారం ఉదయం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పాలిథిన్ కవర్ల నిషేధంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పాలిథిన్ కవర్ల నిషేధం అధికారుల నుంచే ప్రారంభం కావాలన్నారు. తద్వారా ప్రజలకు వాటి వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. గ్రామస్థాయిలో దీన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. కాగా తొలుత అధికారులు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. అనంతరం ఆఫీసు నుంచి పద్మనాభం ప్రధాన జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, యూత్ అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, ఎంఈవోలు పి. రమణ, బాబులాల్, ఏవో చలం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు, అలాగే రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వి. శంకరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎస్. సన్యాసిప్పడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అవాల గంగరాజు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో...

విశాలాక్షినగర్ : ప్రజలంతా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు కోరారు. కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయం ఆవరణలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మన్మథరావు, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : రాష్ట్ర ప్రజలంతా స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సింహాచలం దేవస్థానం ఈఓ త్రినాథరావు పిలుపునిచ్చారు. శనివారం సింహగిరిపై ఈఓ సారథ్యంలో సిబ్బంది స్వచ్ఛ దేవాలయం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన మాడవీధుల్లో, నక్షత్ర వనం, గోకులం తదితర ప్రాంగణాలను అధికారులు, సిబ్బంది శుభ్రపరిచారు. అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు.

ప్రభుత్వాస్పత్రిలో...

భీమునిపట్నం : పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి పరిసరాల్లో చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే 3వ వార్డు ఎగువపేటలో భీమిలి జోనల్ అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో గంటా నూకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు, మేస్త్రి రేగాని రవి పాల్గొన్నారు.

తాటితూరులో..

భీమునిపట్నం రూరల్ : విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత గురించి తెలుసుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు.. అపారిశుధ్య వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు తెలియజేయడం వల్ల భవిష్యత్తులో మంచి మార్పు వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, డీఎల్‌డీఓ సీహెచ్ నిర్మలాదేవి, ఎంపీడీఓ నరసింహారావు, డిప్యూటీ ఎంపీడీఓ రమేష్‌నాయుడు, తహశీల్దార్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి : ఏఓ

పద్మనాభం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం పొందడానికి రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని ఏఓ చలం తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 2025 ఖరీఫ్ పంట కాలానికి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులు పంటల బీమా పథకంలో చేరాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లిస్తారన్నారు. ఉద్యాన పంటలకు 5 శాతం, వరికి 2 శాతం ప్రీమియం చెల్లించాలన్నారు.

స్వామివారి సన్నిధిలో సహ చట్టం కమిషనర్



సింహాచలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామిని సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ చావలి సునీల్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న కమిషనర్ గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు.

మలక్‌పేటలో హత్య కేసుతో షీలానగర్ చోరీ కేసుకు లింక్

ముగ్గురు చోరీ కేసు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేసిన మలక్‌పేట పోలీసులు

నిందితులందరూ నెల్లూరు వాసులే.. మిగిలిన నిందితుని కోసం గాలింపు

గాజువాక, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మలక్‌పేటలో జరిగిన ఓ వ్యక్తి హత్య విశాఖ నగరంలోని షీలానగర్‌లో జరిగిన భారీ చోరీ కేసుకు సంబంధించిన నిందితులను పట్టించినట్టు తెలిసింది. షీలానగర్‌లో పెళ్లింట్లో చోరీకి పాల్పడిన ముగ్గురు దుండగుల్లో ఇద్దరు మలక్‌పేట హత్య కేసులో నిందితులుగా పట్టుబడ్డారు. నిందితుల వద్దనున్న బ్యాగులను మలక్‌పేట పోలీసులుతనిఖీ చేయగా బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు లభ్యమయ్యా యి. వాటి గురించి పోలీసులు ఆరా తీయగా విశాఖలోని షీలానగర్‌లో చోరీకి పాల్పడిన వాటిలో తమ భాగమని అంగీకరించారు. దీంతో వారు గాజువాక క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు.సీఐ కె.శ్రీనివాస్, ఎస్‌ఐ మన్మథరావులతో కూడిన బృందం మలక్‌పేట చేరుకుని చోరీ వివరాలను అక్కడి పోలీసులకు వివరించారు. ప్రస్తుతం చోరీ సొత్తు మలక్‌పేట పోలీసుల ఆధీనంలోనే ఉంది. నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు నిందితులు షీలానగర్‌లో చోరీకి పాల్పడి తిరిగి అక్కడకు వెళ్తున్న క్రమంలో మలక్‌పేటలో హత్యకు సంబంధించి సుపారీ కుదిరింది. దీంతో ఇద్దరు మలక్‌పేట వెళ్లగా, మరో నిందితుడు తన చోరీ సొత్తు భాగంతో నెల్లూరు వెళ్లిపోయాడు. గాజువాక పోలీసులు నెల్లూరు వెళ్లిపోయిన నిందితున్ని పట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు.

ఏయూకు జియో స్పేషియల్ అవార్డు

... 5వ పేజీ తరువాయి

విభాగానికి సంబంధించిన సాగిస్తున్న పరిశోధన, పీహెచ్ డీలు ప్రదానం, పీహెచ్‌డీలో భాగంగా సంయుక్త పరిశోధన, కీలకమైన సమాచారాన్ని సేకరించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఆయన 1991 నుంచి రిమోట్ సెన్సింగ్, జియో స్పేషియల్‌పై పరిశోధనలు సాగిస్తున్నారు. గడిచిన 35 ఏళ్లుగా జియో స్పేషియల్ రంగంలో ఆయన విశేషమైన సేవలను అందిస్తున్నారు. ఏయూకు జాతీయ జియో స్పేషియల్ అవార్డు లభించడం పట్ల వీసీ జీపీ రాజశేఖర్ ఆనందం వ్యక్తం చేశారు. అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులను సాధించి వర్సిటీ ఖ్యాతి పెంచాలని సూచించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించుకుంటున్న తరుణంలో ఈ అవార్డు రావడం, విద్య, నాయకత్వం, ఆవిష్కరణలలో వర్సిటీ ఘనమైన వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. అవార్డు దక్కించుకున్న వజీర్ మహ్మద్‌ను వీసీ జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో అభినందించారు.

స్పా ముసుగులో వ్యభిచారం!

... 5వ పేజీ తరువాయి

వాటన్నింటిలోనూ క్రాస్ జెండర్ మసాజ్‌లు, వ్యభిచారం వంటివి విచ్చలవిడిగా జరిగిపోతున్నాయి. థాయ్‌లాండ్, కేరళ, గోవా వంటి ప్రాంతాల నుంచి యువతులను నగరానికి తెప్పించి వారితో మసాజ్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చికి సమాచారం అందడంతో ఈనెల 17న రామాటాకీస్ సమీపంలోని మినీథాయ్‌స్పాలో తనిఖీలు చేయాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆదేశించారు. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేసి వ్యభిచారం కోసం ఉన్న ఐదుగురు యువతులు, ఒక విటుడితోపాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు.స్పా సెంటర్‌లో భారీగా కండోమ్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అలాగే శుక్రవారం ద్వారకానగర్ మొదటిలైన్‌లోని లావీస్ థాయ్ స్పాలో టాస్క్‌ఫోర్స్, ద్వారకా నగర్ స్టేషన్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నలుగురు యువతులు, ఇద్దరు విటులు, ఒక నిర్వాహకుడిని అరెస్టు చేశారు. నగరంలో ఈ తరహా కార్యకలాపాలు చాలా స్పా సెంటర్లలోనూ జరుగుతున్నాయని అంటున్నారు. పోలీసులు, ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేస్తే ఇలాంటి చీకటి కార్యకలాపాలు బట్టబయలయ్యే అవకాశం లేదు.

110 మందికి నేత్ర వైద్య పరీక్షలు

భీమిలిరూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సంగివలస లక్ష్మీకేర్ ఆసుపత్రి వద్ద శనివారం వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యులు 110 మందికి పరీక్షలు చేసి, 35 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అన్నా, దీపక్, వెంపాడ శ్రీనివాసరెడ్డి, రామభద్రరాజు, రాజు, పాల్గొన్నారు.

రూ.14 కోట్లతో కన్వెన్షన్ సెంటర్లు

... 5వ పేజీ తరువాయి

రహదారికి రూ.40 లక్షలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలకు రూ.50 లక్షలు, ఏపీఈపీడీసీఎల్‌కు రూ.15 లక్షలు చెల్లించారు. మొత్తం నిర్మాణ వ్యయం రూ.9.5 కోట్లకు చేరింది. ఇది ఆగస్టులో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. పెందుర్తి మండలం చీమలాపల్లిలో కన్వెన్షన్ సెంటర్‌కు కూడా 846 చ.మీ. స్థలాన్నే తీసుకున్నారు. దీనిని గ్రౌండ్+మొదటి అంతస్తును చెరో 9,450 చ.అ. విస్తీర్ణంతో మొత్తం 18,900 చ.అ. వినియోగం స్థలం వచ్చేలా డిజైన్ చేశారు. ఈ భవనంలో వేయి మందితో కార్యక్రమం నిర్వహించుకోవచ్చు. దీనికి ఎంపీ లాడ్స్ నుంచి రూ.2 కోట్లు రాగా, వీఎంఆర్‌డీఏ రూ.5.84 కోట్లు కేటాయించింది. ఈ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, స్థలం అభివృద్ధికి రూ.55 లక్షలు, ఎలక్ట్రికల్ వర్కుల కోసం రూ.56 లక్షలు, ఏసీలకు రూ.91 లక్షలు, ల్యాండ్ స్కేపింగ్‌కు రూ.5 లక్షలు, లిఫ్ట్ పనులకు రూ.21.6 లక్షలు, అప్రోచ్ రహదారికి రూ.30 లక్షలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలకు రూ.50 లక్షలు, ఏపీఈపీడీసీఎల్‌కు రూ.15 లక్షలు కలిపి మొత్తం రూ.7.84 కోట్లు వెచ్చించారు.ఈ భవనం నిర్మాణం పూర్తయింది. ఎలివేషన్ పనులు చేస్తున్నారు.

ఆగస్టులో ప్రారంభోత్సవం

ఈ రెండు కన్వెన్షన్ సెంటర్లను ఆగస్టు నెలలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాము. ఈలోగా మిగిలిన పనులు కూడా పూర్తిచేస్తాం. ఇవి అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతాల ప్రజల కార్యక్రమాల నిర్వహణకు మంచి సౌకర్యం లభిస్తుంది.

- ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి





మృతులు పట్నాయక్, రామిరెడ్డి (ఫైల్)

కూర్మన్నపాలెం,జూలై 19 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశాలోని కొరాపుట్ జిల్లా కుందిలి గ్రామానికి చెందిన మానస రంజన్ పట్నాయక్ తన భార్య రాధికతో కలిసి 88వ వార్డు కూర్మన్నపాలెంలో శాతవాహన నగర్‌లో నివాసం ఉంటున్నారు. నగరంలో ఎస్‌ఎల్ కన్సల్టెన్సీలో పని చేస్తున్న రాధికను బస్సు ఎక్కించేందుకు స్కూటీపై వెళుతుండగా కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద అనకాపల్లి నుంచి గాజువాక వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాధికకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అలాగే పాలవలస దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో అట్టవానిపాలేనికి చెందిన నక్కా రామిరెడ్డి (45) మృతి చెందారు. స్థానిక హిందుజా సంస్థలో వెల్డర్‌గా పని చేస్తున్న రామిరెడ్డి తమ ఇంటి నుంచి బైకుపై విధులకు వెళ్తుండగా పలికిలి దొడ్డి కూడలి వద్ద ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొంది. దీంతో రామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి కాకి శ్రీనివాసరెడ్డికి గాయాలయ్యాయి.

నగర పోలీసింగ్‌లో మార్పులు : సీపీ

మహారాణిపేట,జూలై 19 (ఆంధ్రజ్యోతి) :నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పారదర్శకత పోలీసింగ్‌కు ఆధునిక ద్విచక్ర వాహనాలు ఉపయుక్తంగా ఉంటాయని పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఏఎంఎన్‌ఎస్ తన సీఎస్ఆర్ నిధులతో 25 ద్విచక్రవాహనాలను పోలీసు శాఖకు సమకూర్చింది. అత్యుత్తమ సాంకేతిక పరికరాలతో రూపొందించిన 25 ద్విచక్రవాహనాలను కాళీమాత ఆలయం వద్ద కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగర కమీషనరేట్ పరిధిలోని పోలీసింగ్‌లో సమూల మార్పులు చేపట్టామన్నారు. కొద్ది రోజుల క్రితం సమకూరిన 64 ద్విచక్రవాహనాలతో కలిపి మొత్తం 88 ఆధునిక వాహనాలు విజిబుల్ పోలీసింగ్‌కు ఉపయుక్తంగా ఉంటాయన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు యువకుల మృతి

ఆనందపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేర్వేరు గ్రామాల్లో గడ్డి మందు తాగిన ఇద్దరు యువకులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. కణమాం పంచాయతీకి చెందిన మహారాజ్‌కుమార్ (24) ఈనెల 12న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆరిలోవలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అలాగే ఆకులవారి కళ్లాలులో గొర్లె శంకరరావు (30) కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శంకరరావు ఐదు రోజుల క్రితం గడ్డి మందు తాగగా కుటుంబీకులు కొమ్మాదిలోని గాయత్రి ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

96.36 శాతం కార్డుదారులకు..

... 5వ పేజీ తరువాయి

వి.భాస్కర్ తెలిపారు. ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ నాలుగు గ్రామీణ మండలాలు, నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 5,24,986 మంది కార్డుదారులు ఉండగా, జూలై నెలకుగాను 5,05,887 మంది కార్డుదారులకు (96.36 శాతం) సరకులు అందించామన్నారు. అత్యధికంగా పెందుర్తి మండలంలో 97.84 శాతం, ఆనందపురంలో 97.42 శాతం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశామన్నారు. ఎండీయూ వ్యవస్థ ఉన్నప్పుడు ఈ ఏడాది మే నెలలో 96.67 శాతం సరుకులు పంపిణీ జరిగిందన్నారు. ఆ వ్యవస్థ రద్దు అయిన తరువాత జూన్‌లో 93.83 శాతం పంపిణీ చేయగా, జూలైలో కొన్ని ఇబ్బందులు పరిష్కరించడంతో సరకులు పంపిణీ 96.36 శాతానికి పెరిగిందన్నారు.

రేషన్ డీలర్ల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

గురవుతున్నారు.దీంతో తమ డిపోలో కాకుండా సమీపంలో ఉన్న మరో డిపో నుంచి బియ్యం, పంచదార తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముస్లింతాటిచెట్లపాలెంలో ఉన్న కార్డుదారులకు సంబంధించిన డిపో సంఘం ఆఫీస్ రోడ్డులో నిర్వహిస్తున్నారు. దీంతో ముస్లింతాటిచెట్లపాలెం కార్డుదారులు సమీపంలో గల ఇతర డిపోల నుంచి సరుకులు తెచ్చుకుంటున్నారు. కురుపాం మార్కెట్‌లో ఒకే ప్రాంతంలో నాలుగు డిపోలు ఉన్నాయి. నాలుగు షాపులు ఒకేచోట ఉండకూడదని జిల్లా పౌరసరఫరాల అధికారి పలుమార్లు ఆదేశించినా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, డీలర్లు అవేవీ పట్టించుకోవడం లేదు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తరువాత సచివాలయాలకు రేషన్ డిపోలు అనుసంధానం చేశారు. అంటే సచివాలయ పరిధిలోని కార్డుదారులకు అందుబాటులో రేషన్ డిపో ఉండాలి. కొన్నాళ్లు ఈ వ్యవస్థ బాగానే కొనసాగినా, ఎండీయూలు వచ్చిన తరువాత డిపో డీలర్లకు పనిలేకుండా పోయింది. దీంతో డిపోలను మారుమూల ప్రాంతాలకు తరలించేశారు. ఎండీయూల రద్దుతో మరోసారి డిపోల ప్రాధాన్యం పెరిగింది. ఎండీయూ రద్దు నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కార్డుదారులకు అందుబాటులోనే డిపోలు నిర్వహించాలని ఆదేశించారు. అయితే కొందరు డీలర్లు మాత్రం అధికారుల ఆదేశాలు పాటించారు. మరికొందరు యథావిధిగా తమకు అనుకూలంగా ఉండే చోట్ల మాత్రమే డిపోలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోర్టబిలిటీ అవకాశం ఉండడంతో కార్డుదారులు చాలామంది తమకు సమీపంలోని మరో సచివాలయంతో మ్యాప్ అయిన డిపో నుంచి సరుకులు తెచ్చుకుంటున్నారు. దీంతో కొన్ని డిపోల్లో 100 శాతం సరుకుల పంపిణీ జరుగుతుండగా,కొన్ని డిపోల్లో 90 శాతం అంత కంటే తక్కువ శాతం సరుకులు పంపిణీ అవుతున్నాయి. 100 శాతం సరుకులు పంపిణీచేసిన డీలర్లు తమ ప్రాంతంలో ఇంకా కార్డుదారులున్నారని వినతి మేరకు అదనపు కోటా బియ్యం పొందగలుగుతున్నారు. డిపోలు ఒకచోట... కార్డుదారులు మరోచోట ఉన్నప్పటికీ జిల్లాలో ఈ నెల 96 శాతానికిపైగా సరుకుల పంపిణీ జరిగింది. కాగా డిపోలు అందుబాటులో ఉంటే ఎవరికి ఇబ్బంది ఉండదని కార్డుదారులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయమై డీలర్లకు పౌర సరఫరాల శాఖ గత నెలలో నోటీసులు జారీచేసింది. డిపోలు తప్పనిసరిగా సచివాలయం/క్లస్టర్‌తో మ్యాపింగ్ అయిన చోటే ఉండాలని ఆదేశించింది. అయినా కొన్ని డిపోలు ఇంకా మార్చుకునేందుకు డీలర్లు ససేమిరా అంటున్నారు. ఇటువంటి డిపోలకు చౌకడిపోల సంఘనేతలు, అధికార పార్టీ నేతలు అండగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యను జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ వద్ద ప్రస్తావించగా సచివాలయంతో మ్యాపింగ్ అయిన చోట మాత్రమే డిపోలు ఉండాలన్నారు. అందుకు భిన్నంగా ఉన్న డిపోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డబుల్ డెక్కర్ ట్రయల్ రన్

... 5వ పేజీ తరువాయి

24 గంటల పాటు ఎన్ని సార్లయినా ఎక్కి దిగొచ్చు. పర్యాటకులు అన్ని ప్రాంతాలను చూడాలనే ఉద్దేశంతో ఈ వెసులుబాటు కల్పించారు.

బస్సు ఎక్కడుందో తెలిపేందుకు క్యూఆర్ కోడ్

పర్యాటకులు ఒక కేంద్రంలో అక్కడ అన్నీ చూసేసిన తరువాత బస్సు ఎక్కడుందో, ఎంత సేపటిలో వస్తుందో తెలుసుకోవలసి ఉంటుంది. కానీ అన్నిచోట్ల సమాచారం ఉండదు. అందుకని ఇచ్చే టికెట్‌పైనే క్యూఆర్ కోడ్ ఇస్తారు. దానిని స్కాన్ చేస్తే బస్సు ఎక్కడుంది ? ఎంతసేపటిలో వచ్చే అవకాశం ఉందనే సమాచారం తెలుస్తుంది.

ఎంత సమయం పడుతోంది?

సమస్యలు ఏమైనా ఉన్నాయా ?, చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు ఎక్కడైనా అడ్డం వస్తున్నాయా ? అనే విషయాలు గమనిస్తున్నారు. వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటున్నారు. టిక్కెట్ ధర ఎంత అన్నది ఇంకా ఖరారు చేయలేదు. అందరికీ అందుబాటులో ఉండేలా పెడతారని చెబుతున్నారు. బస్సుల నిర్వహణకు కొంత వ్యయం అవుతుంది కాబట్టి ఆ మొత్తం రాబట్టుకునేలా చార్జీలు నిర్ణయిస్తారు.

త్వరలో ఓపెన్ టాప్ బస్సు

రెండు బస్సులకు తోడుగా త్వరలో మరో బస్సు వస్తుంది. అది ఓపెన్ టాప్ బస్సు. అంటే పైన అంతా ఓపెన్‌గా ఉంటుంది. సాయంత్రం వేళ బీచ్ రోడ్డులో ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి యత్నిస్తున్నాం. రాష్ట్రంలో ఈ బస్సుల వినియోగం ఇదే మొదటిసారి కావడంతో సీఎం చంద్రబాబు చేతులు మీదుగా ప్రారంభింపజేయాలని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

మాధవి, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి.

ప్లాస్టిక్ రహిత ఏపీ సాకారం చేద్దాం

- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో వక్తల పిలుపు
- పలు చోట్ల స్వచ్ఛ భారత్, అవగాహన సదస్సులు
- విద్యాలయాలు, కాలనీల్లో ప్రతిజ్ఞ
- పరిసరాలు శుభ్రపరిచిన అధికారులు


ఎంవీపీ రైతు బజార్‌లో స్వచ్ఛభారత్ నిర్వహించిన రైతులు, సిబ్బంది


మద్దిలపాలెం : విద్యార్థులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు


ద్వారకా కాంప్లెక్స్‌లో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

వెంకోజీపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర 2047 మిషన్‌లో భాగంగా శనివారం ఏయూ ఎన్ఎస్ఎస్ విభాగం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఎ.నరసింహారావు, ఇతర ఆచార్యులు, విద్యార్థులు పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ధనుంజయరావు మాట్లాడుతూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తయారు చేయాలని, దాని కోసం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో స్వచ్ఛభారత్

ఎంవీపీ కాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ రైతు బజారులో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రతి కౌంటరు వద్దకు వెళ్లి, ప్లాస్టిక్‌పై అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ సంచులు బదులు నార సంచులు వినియోగించాలని రైతులు, వినియోగదారులకు సూచించారు. అనంతరం బజారు ప్రాంగణమంతా శుభ్రం చేశారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి కె వరహాలు, సహాయకుడు కనకరాజు, జిల్లా లీగల్ సర్వీసెస్ ప్యానల్ న్యాయవాది శ్రీలక్ష్మి, జీవీఎంసి సిబ్బంది, పారా లీగల్ వాలెంటీర్ భవాని, రైతులు, డ్వాక్రా గూపు సభ్యులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం వల్ల ఆరోగ్యపరంగా అనేక అనర్థాలు ఎదురవుతాయని జీవీఎంసీ 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు అన్నారు. శనివారం ఈ వార్డులోని 3 వ సెక్టార్ పరిధిలోగల నెహ్రూ నగర్‌లో గ్రామంలో ప్రతి నెలా మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడడం వల్ల వచ్చే అనర్థాల గురించి ప్రజలకు వివరించారు, ఈ కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు అధ్యక్షడు గాడి సత్యం, విశాఖ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, రాపర్తి గణపతి, రొంగలి రామజోగినాయడు,సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, ఆర్పీలు సూపర్‌వైజర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీలో..

వెంకోజీపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా హెచ్‌బీకాలనీ జంక్షన్ వద్ద పారిశుధ్య సిబ్బంది, టీడీపీ నాయకులు, స్థానికులతో కలిసి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రతిజ్ఞ చేస్తూ ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం మీద అవగాహన కల్పిస్తూ, గుడ్డ సంచులను వినియోగంపై సూచనలు చేశారు. ప్లాస్టిక్ సంచులను వినియోగించడం వల్ల కలుగు నష్టాల గురించి వర్తకులకు వివరించారు. కార్యక్రమంలో 16వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శుభ్రం మేస్త్రిలు నమ్మి చిన్నరాజు, జి.బాబు, శ్రీను, టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, మొల్లి శంకర్, 118 సచివాలయం కమ్యూనిటీస్ కార్యదర్శి గౌతమి, స్థానికులు పాల్గొన్నారు.

ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్ కాంప్లెక్సుల్లో, డిపోల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ప్రతినెలా మూడో శనివారాన్ని ప్లాస్టిక్ నిషేధ దినంగా ప్రకటిస్తూ శనివారం ద్వారకా కాంప్లెక్సులో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రయాణికులకు వివరించి వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆర్టీసీ కాంప్లెక్సుల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నామని, ఎవరైనా కాంప్లెక్స్‌ల్లోని స్టాల్స్‌లో ప్లాస్టిక్ కవర్లు, పాలిథిన్ బ్యాగులను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు, ఏటీఎం (కమర్షియల్) బాపిరాజు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కాలుష్యం నిర్మూలనలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి జయబాబు పిలుపునిచ్చారు. కళాశాలలో శనివారం నిర్వహించిన ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాటాడుతూ ప్రపంచంలో ప్లాస్టిక్ పర్యావరణానికి పెనుభూతంలా విస్తరిస్తోందన్నారు. మనం వినియోగించే వస్తువులు ఎక్కువగా ప్లాస్టిక్ ఆధారితాలేనన్నారు. మనం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకొని పర్యావరణ హితమైన వస్తువుల వినియోగానికి మారాలన్నారు. అలాగే 4ఆర్ నియమం, రెఫ్యూస్, రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం జాతీయ సేవా పథకం జోనల్ అధికారి పోల ఉమామహేశ్వరరావు విద్యార్థులతో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నివారణకు విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు జీవీ ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, బి.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీదేవి సారె ఉత్సవం

పెదవాల్తేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆషాడం సందర్భంగా పెదవాల్తేరులోని కాశీవిశ్వేశ్వస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి పెదవాల్తేరు తదితర ప్రాంతాల మహిళలు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత సన్నాయి వాయిద్యాలు, మేళతాళాలతో ఈ సారె ఊరేగింపు ఉత్సవం పెదవాల్తేరు పురవీధులు, గాంధీ బొమ్మ సెంటర్, కాగితాలవీధి తదితర గ్రామాల మీదుగా ఊరేగింపు నిర్వహించి శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని పార్వతీదేవికి సారె సమర్పించారు. అనంతరం భక్తులు శివపార్వతులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కంభాపు శివారెడ్డి, కాగితాల చిన అప్పారావు, వై.వేణుగోపాల్, ఆలయ అర్చకులు విశ్వనాథ కాశీప్రసాద్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మద్యం కేసుల్లో అమాయకుల్ని ఇరికిస్తున్నారు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



మద్దిలపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఎలాగైనా దెబ్బకొట్టాలన్న ఉద్దేశంతో ఆయన వెనుక ఉండే అమాయకులను కూటమి ప్రభుత్వం మద్యం కేసుల్లో ఇరికిస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు విమర్శించారు. మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి పదమూడు నెలల కాలంలో ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ప్రతి విషయాన్ని గత ప్రభుత్వంపై నెట్టి వేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలను మోసం చేసిన తీరును ప్రజాక్షేత్రంలో తీసుకుని వెళ్తామన్నారు. అధికార పార్టీ అసమర్థతను ఎండగడుతున్న వైసీపీ కార్యక్రమాలను ఓర్వలేక రకారకాల స్కామ్‌లను వైసీపీ నాయకులకు అపాదిస్తున్నారని విమర్శించారు. వైసీపీని నిర్వీర్యం చేయడానికే.. లేని లిక్కర్ స్కాం తీసుకొచ్చి పార్టీలో యాక్టివ్‌గా ఉన్న నాయకులను అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు.

దారపాలెంలో అభివృద్ధి పనులు చేపడతాం

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : దారపాలెం ప్రాంతాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. శనివారం సాయింత్రం 13వ వార్డులో గల దారపాలెంలో గల అల్లూరి సీతా రామరాజు వ్యాలీలో గల కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన నిర్వహించారు. జీవీఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సుమారు రూ.2.79 కోట్ల జీవీఎంసీ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

అలాగే ఈ ప్రాంతంలో రహదారులు, కాలువల పనులు కూడా చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ నేతలే పాత్రకండి ధర్మారావు. కెల్ల సత్యనారాయణ, తెలుగు మహిళ 13వ వార్డు అధ్యక్షురాలు మజ్జి రమణి, స్థానిక అసోసియేషన్ సభ్యులు చంద్రమౌళి, రాంబాబు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

'గిరిజన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

ఎంవీపీ కాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జీసీసీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్ని అర్హతలు ఉన్నా, కాంట్రాక్ట్ సేల్స్‌మెన్‌లను ఇప్పటి వరకూ రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమని కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు జానకిరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 114 అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆటపాటలతో హోరెత్తిన సాగరతీరం

- అలరించిన తమన్ మ్యూజికల్ నైట్


నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


గీతాలాపన చేస్తున్న సమీర్‌భరద్వాజ్

బీచ్ రోడ్డు, జులై 19 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు అలల సవ్వడులు.. మరోవైపు కిర్రాక్ పుట్టించే మ్యూజిక్.. అందుకు తగినట్టుగా యువత కేరింతలు.. శనివారం సాయంకాలం ఆర్కే బీచ్ వద్ద ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తలసేమియా రన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ మ్యూజికల్ నైట్ అలరించింది.

ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు నగర ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తమన్ బృందం వినిపించిన గీతలు, సంగీతానికి సాగర తీరం హోరెత్తింది. వేదికపై ముందుగా నృత్య రూపకంతో కళాకారులు తమ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం నగరానికి చెందిన నృత్య కళాకారులు సినీ, జానపద గీతాలను అలపించి హుషారెత్తించారు.

సింగర్ సమీర్ భరద్వాజ్ తదితరులు ఆలపించిన గీతాలు యువతలో ఉత్సాహం నింపాయి. అలాగే ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడి, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం),

'స్టాండింగ్'లో 93 అంశాలకు ఆమోదం


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ అభివృద్ధి పనులతో పాటు మార్కెట్ల ఆశీలు, దుకాణాలకు లీజులు, ఉద్యోగుల సర్వీసు విషయాలకు సంబంధించిన 93 అంశాలకు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో శనివారం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన అజెండాలో పొందుపరిచిన 60 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో పొందుపరిచిన 33 అంశాలపై కమిటీ చర్చించి ఆమోదం తెలిపింది. కమిటీ ఆమోదించిన 93 అంశాల్లో రూ.31.03 కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించిందని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీకి ఆదాయం సమకూరే మార్గాలను మరింత అభివృద్ధి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్డులోని సిల్వర్ స్వాన్ రెస్టారెంట్‌కు లీజుకు ఇచ్చిన స్థలాన్ని మార్కింగ్ చేసి, అందులోనే వ్యాపార కార్యకలాపాలు సాగించేలా చూడాలని ఆదేశించారు. పార్కుల్లో ప్రవేశ రుసుములు జీవీఎంసీ గెజిట్‌లో నిర్దేశించినట్టుగానే జరిగాలని, ఇందుకోసం పార్కుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని జడ్జీలకు సూచించారు. వర్షాలు ప్రారంభమైనందున నగరంలో దోమల వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ కోసం ఆమోదించిన నిధులను సక్రమంగా వెచ్చించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.నరేశ్‌కుమార్‌కు ఆదేశించారు. సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 32, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 24, పచ్చిమిర్చి 74, కాకరకాయలు 36, బీరకాయలు 28, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 28, బంగాళ దుంపలు17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో)58, అల్లం (పాతది) 48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 54, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	81
లైవ్ ధర	101
విత్ స్కిన్	172
స్కిన్‌లెస్	182

జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి

- జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటరెడ్డి

సిరిపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జీవో 36 ప్రకారం అన్ స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.24,500 వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.

శనివారం జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిత్యావసర ధరల ప్రకారం ఒక కుటుంబం జీవించడానికి కనీసం రూ.26 వేలు ఖర్చు అవుతోందన్నారు. అయితే రూ.13 వేలతో పట్టణాల్లో ఎలా జీవనం గడపాలో ప్రభుత్వం చెప్పాలన్నారు. పారిశుధ్య కార్మికులు, యూజీడీ కార్మికులకు చెల్లిస్తున్న ప్రకారం జీవో 36 ప్రకారం అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.21 వేలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.24,500 కనీసం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి షరతులు లేకుండా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్డ్, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఆప్కాస్‌లో ఉపాధి కల్పించాలన్నారు. 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు అధికారాలు, నిధులు కేటాయించకుండా రూ.లక్షల కోట్లు బడ్జెట్లను కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామన్నారు. నిరసన ప్రదర్శనలో భాగంగా సీఐటీయూ జెండాలను చేతపట్టుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి నగర మేయర్‌కు వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు, ఎం.ఈశ్వరరావు, ఎంవీ ప్రసాద్, బి.ఆనందకుమార్, కనకరాజు, మహేష్, రమణ, వెంకటరావు కార్మికులు పాల్గొన్నారు.

సౌత్ ఏసీపీగా వై.శ్రీనివాసరావు

- క్రైమ్ ఏసీపీగా కె.ధర్మేంద్ర

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీలకమైన సౌత్ సబ్ డివిజన్ ఏసీపీగా వై.శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇస్తూ డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సౌత్ ఏసీపీగా పనిచేసిన టి.త్రినాథ్‌ను ఇటీవల డీజీపీ కార్యాలయానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో గుంటూరు రేంజ్‌కు చెందిన వై.శ్రీనివాసరావును నియమించడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గుంటూరుకు చెందిన ఒక ప్రజాప్రతినిధి శ్రీనివాసరావుకు విశాఖ సౌత్ ఏసీపీ పోస్టింగ్ ఇప్పించాలని నగరానికి చెందిన కీలక ప్రజాప్రతినిధిపై ఒత్తిడి చేయడంతో ఆయన డీజీపీకి చెప్పి మరీ పోస్టింగ్ ఇప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశాఖ రేంజ్‌కు చెందిన పలువురు డీఎస్పీలు పోస్టింగ్‌ల కోసం నెలలు తరబడి ఎదురుచూస్తుంటే తమను పరిగణనలోకి తీసుకోకుండా సామాజిక వర్గాల పేరుతో వేరే రేంజ్‌కు చెందిన అధికారికి ఇక్కడ పోస్టింగ్ ఇవ్వడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా నగర క్రైమ్ ఏసీపీగా పనిచేస్తున్న డి.లక్ష్మణరావును టెక్కలి డీఎస్పీగా బదిలీ చేసి ఆయన స్థానంలో కె.ధర్మేంద్రను నియమించారు.

అర్బన్ తహసీల్దార్‌గా ఎంవీవీ ప్రసాద్



సీతమ్మధార, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అర్బన్ తహసీల్దార్‌గా ఎంవీవీ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఇంతవరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న ఎస్.ఎ. త్రినాథరావు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు.

వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ టెక్నికల్ అఫీషియల్‌గా డాక్టర్ శర్మ



విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ టేబుల్ టెన్నిస్ యూత్ కాంటెండర్, ఫీడర్ వియంటియాన్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్‌ఐసీ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్‌వై. శర్మను నియమిస్తూ టేబుల్ టెన్నిస్ సమాఖ్య శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. లావోస్‌లో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి సాంకేతిక నిపుణుడిగా భారత్ నుంచి నియమితుడైన ఏకైక అంతర్జాతీయ రిఫరీ కావడం విశేషం. ఆగస్టు 9 నుంచి జరిగే టోర్నీకి వెళ్తున్న శర్మను ఎల్‌ఐసీ ఉన్నతాధికారులు, టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చెస్ బోర్డులు, విద్యా సామగ్రి పంపిణీ

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగం దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ తమ అనుబంధ సంఘాలు, కెన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో 'చెస్ అందరిదీ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనుంది. దీనిలో భాగంగా ఆదివారం చిన్నారులలో చెస్ క్రీడపై ఆసక్తి కలిగించేందుకు 'ఒక ఎత్తు జీవితాన్ని మార్చగలదు' (వన్ మూవ్ కెన్ ఛేంజ్ లైఫ్) అనే థీమ్‌తో ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షుడు సురేష్ అడుసుపల్లి శనివారం వివిధ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు చెస్ బోర్డులు, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పిల్లలను చదరంగంలో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రోత్సాహానిచ్చేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. చిన్నారులలో జ్ఞాపకశక్తి, నిర్ణయ సామర్థ్యం, ఆలోచన శక్తి, క్రమశిక్షణ పెంపొందించడానికి చదరంగం దోహదపడుతుందని పేర్కొన్నారు. కెన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.సంతోష్ మాట్లాడుతూ చిన్నారులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా సంఘం తరఫున చేయూత ఇస్తామన్నారు.

నగర పోలీసింగ్‌లో సమూల మార్పులు

▸ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వెల్లడి

మహారాణిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పారదర్శకత పోలీసింగ్‌కు ఆధునిక ద్విచక్ర వాహనాలు ఉపయుక్తంగా ఉంటాయని పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఏఎంఎన్‌ఎస్ తన సీఎస్ఆర్ నిధులతో 25 ద్విచక్రవాహనాలను పోలీసు శాఖకు సమకూర్చింది. అత్యుత్తమ సాంకేతిక పరికరాలతో రూపొందించిన 25 ద్విచక్రవాహనాలను బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిలు శనివారం కొబ్బరికాయలు కొట్టి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగర కమీషనరేట్ పరిధిలోని పోలీసింగ్‌లో సమూల మార్పులు చేపట్టామన్నారు. కొద్ది రోజుల క్రితం సమకూరిన 64 ద్విచక్రవాహనాలతో కలిపి మొత్తం 88 ఆధునిక వాహనాలు విజిబుల్ పోలీసింగ్‌కు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రాంతాలకు వీటి ద్వారా త్వరగా చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకోగలుగుతారన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ వాహనాలు అందించిన ఆర్సెలర్‌మిట్టల్ నిప్పాన్ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించటానికి ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఎన్‌ఎస్ ప్రతినిధులు డీఎస్ వర్మ, ఎం.రవీంద్రనాథ్, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ద్విచక్రవాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అంతర్జాతీయ క్రీడా వేదికగా విశాఖ

▸ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టోర్నీలో శాప్ ఛైర్మన్ రవినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు, చిత్రంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్రీడా పోటీలకు అనువైన విశాఖలో అత్యుత్తమ ప్రమాణాలతో సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తామని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈత కొలనులు (స్విమ్మింగ్ పూల్స్) ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ క్రీడా సముదాయాలు నిర్వహిస్తున్న లీజుదారులు వ్యాపార దృక్పథం చూపకుండా క్రీడాకారుల అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్స్‌లో జరుగుతున్న సబ్ జూనియర్ బాలుర బాలికల ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టోర్నీకి శనివారం ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ గణబాబుతో కలిసి హాజరయ్యారు. సాగరతీరంలో సహజసిద్ధంగా ఉండే క్రీడా సదుపాయాలు విశాఖకు వరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ద ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, జీవీఎంసీ స్పోర్ట్సు డైరక్టర్ ఈఏ.రాజు, రాష్ట్ర ఈత క్రీడాకారుల సంఘం ప్రతినిధులు డాక్టర్ ఓబులరెడ్డి, వి.గోవిందరాజు, మోహన్ వెంకటరామ్, ఎస్3 స్పోర్ట్సు ఫౌండర్ సహాని, శాప్ డైరక్టర్లు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి'



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి అటవీ సంపదను కాపాడాలని పౌర, ప్రజా సంఘాల నాయకులు కోరారు. శనివారం ఎల్‌ఐసీ సర్కిల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతిర్యాలీ నిర్వహించారు. ఆదివాసీలను తరిమికొట్టడానికి, వారికి అండగా ఉన్న మావోయిస్టు పార్టీని అంతం చేస్తామని ప్రటించి ఆపరేషన్ కగార్ పేరుతో దారుణ మారణకాండను జరుపుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను హరిస్తోందని విమర్శించారు. మావోయిస్టులపై జరుపుతున్న దాడులను హోంమంత్రి అమిత్‌షా తక్షణమే నిలిపివేసి ఆ పార్టీలతో శాంతి చర్చలు జరపాలన్నారు. వేదిక కన్వీనర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యం వహించగా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో హత్య కేసుతో షీలానగర్ చోరీ కేసుకు లింక్

▸ ముగ్గురు చోరీ కేసు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేసిన మలక్‌పేట పోలీసులు

▸ నిందితులందరూ నెల్లూరు వాసులే.. మిగిలిన నిందితుని కోసం గాజువాక పోలీసుల గాలింపు

గాజువాక, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మలక్‌పేటలో జరిగిన ఓ వ్యక్తి హత్య విశాఖ నగరంలోని షీలానగర్‌లో జరిగిన భారీ చోరీ కేసుకు సంబంధించిన నిందితులను పట్టించినట్టు తెలిసింది. షీలానగర్‌లో పెళ్లింట్లో చోరీకి పాల్పడిన ముగ్గురు దుండగుల్లో ఇద్దరు మలక్‌పేట హత్య కేసులో నిందితులుగా పట్టుబడ్డారు. నిందితుల వద్దనున్న బ్యాగులను మలక్‌పేట పోలీసులు తనిఖీ చేయగా బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు లభ్యమయ్యాయి. వాటి గురించి పోలీసులు ఆరా తీయగా విశాఖలోని షీలానగర్‌లో చోరీకి పాల్పడిన వాటిలో తమ భాగమని అంగీకరించారు. దీంతో వారు గాజువాక క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ కె.శ్రీనివాస్, ఎస్ఐ మన్మథరావులతో కూడన బృందం మలక్‌పేట చేరుకుని చోరీ వివరాలను అక్కడి పోలీసులకు వివరించారు. ప్రస్తుతం చోరీ సొత్తు మలక్‌పేట పోలీసుల ఆధీనంలోనే ఉంది. నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు నిందితులు షీలానగర్‌లో చోరీకి పాల్పడి తిరిగి అక్కడకు వెళ్తున్న క్రమంలో మలక్‌పేటలో హత్యకు సంబంధించి సుపారీ కుదిరింది. దీంతో ఇద్దరు మలక్‌పేట, మరో నిందితుడు తన చోరీ సొత్తు భాగంతో నెల్లూరు వెళ్లిపోయాడు. గాజువాక క్రైమ్ పోలీసులు నెల్లూరు వెళ్లిన నిందితున్ని పట్టుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఏయూకు జియో స్పేషియల్ అవార్డు

(5వ పేజీ తరువాయి)

విభాగానికి సంబం ధించిన సాగిస్తున్న పరిశోధన, పీహెచ్‌డీలు ప్రదానం, పీహెచ్‌డీలో భాగంగా సంయుక్త పరిశోధన, కీలకమైన సమాచారాన్ని సేకరించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఆయన 1991 నుంచి రిమోట్ సెన్సింగ్, జియో స్పేషియల్‌పై పరిశోధనలు సాగిస్తున్నారు. గడిచిన 35 ఏళ్లుగా జియో స్పేషియల్ రంగంలో ఆయన విశేషమైన సేవలను అందిస్తున్నారు. ఏయూకు జాతీయ జియో స్పేషియల్ అవార్డు లభించడం పట్ల వీసీ జీపీ రాజశేఖర్ ఆనందం వ్యక్తం చేశారు. అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులను సాధించి వర్సిటీ ఖ్యాతి పెంచాలని సూచించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించుకుంటున్న తరుణంలో ఈ అవార్డు రావడం, విద్య, నాయకత్వం, ఆవిష్కరణలలో వర్సిటీ ఘనమైన వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. అవార్డు దక్కించుకున్న వజీర్ మహ్మద్‌ను వీసీ జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో అభినందించారు.

మత్తుమందులు స్వాధీనం

మహారాణిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట పరిధిలో అనుమతి లేకుండా మత్తుమందులు అమ్ముతున్న దుకాణాలపై డ్రగ్ కంట్రోల్ అధికారులు శనివారం దాడులు జరిపారు. టాస్క్‌ఫోర్సు అధికారులకు అందిన సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాడులునిర్వహించి మత్తు ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్సు సీఐ భాస్కరరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ నార్త్ లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా కోన శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కోన శ్రీనివాసరావు

మహారాణిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సేవాతత్పరత ఉన్న సంస్థగా తమ క్లబ్‌కు విశేష చరిత్ర ఉందని విశాఖ నార్త్ లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు అన్నారు. హోటల్ దసపల్లాలో శనివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోన శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా రూపవతి, కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ 50 సంవత్సరాల చరిత్ర కలిగిన నార్త్ క్లబ్ సేవలను విస్తృత పరుస్తామన్నారు. విశాఖను లయన్స్ డిస్ట్రిక్‌గా మార్చేందుకు కృషి చేస్తానన్నారు.

ఆలయాల అభివృద్ధికి చేయూత ఇవ్వండి

▸ విజయనగరం ఎమ్మెల్యేకు టీడీపీ నాయకుల వినతి

మురళీనగర్, జులై 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరం శాసన సభ్యురాలు అదితి గజపతి రాజును టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి ఎస్.వరప్రసాద్, న్యాయవాది నరసింహ, బీజేపీ నాయకులు కె.వి.రమణ తదితరులు ఆమెను కలసిన వారిలో ఉన్నారు. మాధవధార ప్రాంతంలోని సింహాచలం దేవస్థానం ఉప దేవాలయాలు పురాతన మాధవస్వామి, భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాలు ఉన్న మాధవధార క్షేత్రాన్ని రాజవంశీకుల హోదాలోనూ, రాజకీయ ప్రతినిధిగానూ అభివృద్ధికి బాటలు వేయాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ, మహిళా ప్రతినిధిగా మరింతగా ఉన్నతి సాధించాలని నాయకులు ఆకాంక్షించారు.



అదితి గజపతిరాజును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



మానస్ రంజన్ పట్నాయక్(ఫైల్)



నక్కా రామిరెడ్డి (ఫైల్)

కూర్మన్నపాలెం,జూలై 19 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు ఘటనా స్థలాల్లోనే మృతి చెందారు. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాలోని కొరాపుట్ జిల్లా కుందిలి గ్రామానికి చెందిన మానస రంజన్ పట్నాయక్ తన భార్య రాధికతో కలిసి జీవీఎంసీ 88వ వార్డు కూర్మన్నపాలెంలో శాతవాహననగర్‌లో నివాముంటున్నారు. విశాఖ నగరంలో ఎస్ఎల్ కన్సల్టెన్సీలో పని చేస్తున్న తన భార్య రాధికను బస్సు ఎక్కించేందుకు స్కూటీపై వెళుతుండగా కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద అనకాపల్లి నుంచి గాజువాకకు అతి వేగంతో వస్తున్న లారీ ఢీ కొనడంతో మానస్ రంజన్ పట్నాయక్ కుడి వైపు పడిపోవటంతో ఆయన మీద నుంచి లారీ దూసుకుపోయింది. దీంతో ఆయన సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఎడమవైపునకు పడిన రాధికకు తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. మానస్ రంజిత్ కుమార్ దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని రెడ్డీ ల్యాబ్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు వివాహమై 4 ఏళ్లు అయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రంజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే.. పాలవలస దగ్గర శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అట్టవానిపాలేనికి చెందిన నక్కా రామిరెడ్డి (45) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. స్థానిక హిందుజా సంస్థలో వెల్డర్‌గా పని చేస్తున్న రామిరెడ్డి తమ ఇంటి వద్ద నుంచి బైకుపై విధులకు బయలుదేరాడు. పలికిలి దొడ్డి కూడలి వద్ద బైకు మలుపు తిరుగుతుండగా, ఎదురుగా పాలు తీసుకొని అతి వేగంతో వస్తున్న మరో బైకు రామిరెడ్డిని బలంగా ఢీకొంది. దీంతో రామిరెడ్డి కింద పడిపోగా, తలకు తీవ్ర గాయం కావడంతో ప్రమాదం జరిగిన స్థలంలోనే మృతి చెందాడు. రామిరెడ్డిని ఢీకొన్న కాకి శ్రీనివాసరెడ్డికి కూడా గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన రామిరెడ్డి భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డికి కొడుకు ఛాందిక్ రెడ్డి, కుమార్తె నీహారిక రెడ్డి ఉన్నారు. రామిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు.

96.36 శాతం కార్డుదారులకు రేషన్ సరకులు పంపిణీ

(5వ పేజీ తరువాయి)

వి.భాస్కర్ తెలిపారు. ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ నాలుగు గ్రామీణ మండలాలు, నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 5,24,986 మంది కార్డుదారులు ఉండగా, జూలై నెలకుగాను 5,05,887 మంది కార్డుదారులకు (96.36 శాతం) సరకులు అందించామన్నారు. అత్యధికంగా పెందుర్తి మండలంలో 97.84 శాతం, ఆనందపురంలో 97.42 శాతం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశామన్నారు. ఎండీయూ వ్యవస్థ ఉన్నప్పుడు ఈ ఏడాది మే నెలలో 96.67 శాతం సరుకులు పంపిణీ జరిగిందన్నారు. ఆ వ్యవస్థ రద్దు అయిన తరువాత జూన్‌లో 93.83 శాతం పంపిణీ చేయగా, జూలై వచ్చేసరికి కొన్ని ఇబ్బందులు పరిష్కరించడంతో సరకులు పంపిణీ 96.36 శాతానికి పెరిగిందన్నారు.

స్పా ముసుగులో వ్యభిచారం!

(5వ పేజీ తరువాయి)

వాటన్నింటిలోనూ క్రాస్ జెండర్ మసాజ్‌లు, వ్యభిచారం వంటివి విచ్చలవిడిగా జరిగిపోతున్నాయి. థాయ్‌లాండ్, కేరళ, గోవా వంటి ప్రాంతాల నుంచి యువతులను నగరానికి తెప్పించి వారితో మసాజ్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చికి సమాచారం అందడంతో ఈనెల 17న రామాటాకీస్ సమీపంలోని మినీథాయ్‌స్పాలో తనిఖీలు చేయాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆదేశించారు. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేసి వ్యభిచారం కోసం ఉన్న ఐదుగురు యువతులు, ఒక విటుడితో పాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. స్పా సెంటర్‌లో భారీగా కండోమ్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అలాగే శుక్రవారం ద్వారకానగర్ మొదటిలైన్‌లోని లావీస్ థాయ్ స్పాలో టాస్క్‌ఫోర్స్, ద్వారకా నగర్ స్టేషన్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నలుగురు యువతులు, ఇద్దరు విటులు, ఒక నిర్వాహకుడిని అరెస్టు చేశారు. నగరంలో ఈ తరహా కార్యకలాపాలు చాలా స్పా సెంటర్లలోనూ జరుగుతున్నాయని అంటున్నారు. పోలీసులు, ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేస్తే ఇలాంటి చీకటి కార్యకలాపాలన్నీ బట్టబయలయ్యే అవకాశం లేదు.

రూ.14 కోట్లతో కన్వెన్షన్ సెంటర్లు

(5వ పేజీ తరువాయి)

రహదారికి రూ.40 లక్షలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలకు రూ.50 లక్షలు, ఏపీఈపీడీసీఎల్‌కు రూ.15 లక్షలు చెల్లించారు. మొత్తం నిర్మాణ వ్యయం రూ.9.5 కోట్లకు చేరింది. ఇది ఆగస్టులో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. పెందుర్తి మండలం చీమలాపల్లిలో కన్వెన్షన్ సెంటర్‌కు కూడా 846 చ.మీ. స్థలాన్నే తీసుకున్నారు. దీనిని గ్రౌండ్+మొదటి అంతస్థును చెరో 9,450 చ.అ. విస్తీర్ణంతో మొత్తం 18,900 చ.అ. వినియోగం స్థలం వచ్చేలా డిజైన్ చేశారు. ఈ భవనంలో వేయి మందితో కార్యక్రమం నిర్వహించుకోవచ్చు. దీనికి ఎంపీ లాడ్స్ నుంచి రూ.2 కోట్లు రాగా, వీఎంఆర్‌డీఏ రూ.5.84 కోట్లు కేటాయించింది. ఈ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, స్థలం అభివృద్ధికి రూ.55 లక్షలు, ఎలక్ట్రికల్ వర్కుల కోసం రూ.56 లక్షలు, ఏసీలకు రూ.91 లక్షలు, ల్యాండ్ స్కేపింగ్‌కు రూ.5 లక్షలు, లిఫ్ట్ పనులకు రూ.21.6 లక్షలు, అప్రోచ్ రహదారికి రూ.30 లక్షలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలకు రూ.50 లక్షలు, ఏపీఈపీడీసీఎల్‌కు రూ.15 లక్షలు కలిపి మొత్తం రూ.7.84 కోట్లు వెచ్చించారు. ఈ భవనం నిర్మాణం పూర్తయింది. ఎలివేషన్ పనులు చేస్తున్నారు.

ఆగస్టులో ప్రారంభోత్సవం

ఈ రెండు కన్వెన్షన్ సెంటర్లను ఆగస్టు నెలలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాము. ఈలోగా మిగిలిన పనులు కూడా పూర్తిచేస్తాం. ఇవి అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతాల ప్రజల కార్యక్రమాల నిర్వహణకు మంచి సౌకర్యం లభిస్తుంది.

- ప్రణవ్ గోపాల్, ఛైర్మన్, వీఎంఆర్‌డీఏ

డబుల్ డెక్కర్ ట్రయల్ రన్

(5వ పేజీ తరువాయి)

24 గంటల పాటు ఎన్ని సార్లయినా ఎక్కి దిగొచ్చు. పర్యాటకులు అన్ని ప్రాంతాలను చూడాలనే ఉద్దేశంతో ఈ వెసులుబాటు కల్పించారు.

బస్సు ఎక్కడుందో తెలిపేందుకు క్యూఆర్ కోడ్

పర్యాటకులు ఒక కేంద్రంలో అక్కడ అన్నీ చూసేసిన తరువాత బస్సు ఎక్కడుందో, ఎంత సేపటిలో వస్తుందో తెలుసుకోవలసి ఉంటుంది. కానీ అన్నిచోట్ల సమాచారం ఉండదు. అందుకని ఇచ్చే టికెట్‌పైనే క్యూఆర్ కోడ్ ఇస్తారు. దానిని స్కాన్ చేస్తే బస్సు ఎక్కడుంది? ఎంతసేపటిలో వచ్చే అవకాశం ఉందనే సమాచారం తెలుస్తుంది. ఈ సౌకర్యం వల్ల బస్సు వచ్చేలోగానే అక్కడి పర్యాటక కేంద్రం సందర్శన పూర్తి చేసుకోవచ్చు.

ఎంత సమయం పడుతోంది?

మార్గమధ్యంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా?, చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు ఎక్కడైనా అడ్డం వస్తున్నాయా? అనే విషయాలు గమనిస్తున్నారు. వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటున్నారు. టిక్కెట్ ధర ఎంత అనేది? ఇంకా ఖరారు చేయలేదు. అందరికీ అందుబాటులో ఉండేలా పెడతారని చెబుతున్నారు. ఈ బస్సుల నిర్వహణకు కొంత వ్యయం అవుతుంది కాబట్టి ఆ మొత్తం రాబట్టుకునేలా చార్జీలు నిర్ణయిస్తారు.

త్వరలో ఓపెన్ టాప్ బస్సు

ఈ రెండు బస్సులకు తోడుగా త్వరలో మరో బస్సు వస్తుంది. అది ఓపెన్ టాప్ బస్సు. అంటే పైన అంతా ఓపెన్‌గా ఉంటుంది. సాయంత్రం వేళ ఈ బస్సులో బీచ్ రోడ్డులో ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. వీటిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి యత్నిస్తున్నాం. రాష్ట్రంలో ఈ తరహా బస్సుల వినియోగం ఇదే మొదటిసారి కాబట్టి సీఎం చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ప్రారంభింపజేయాలని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

-మాధవి, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి

రేషన్ డీలర్ల ఇష్టారాజ్యం

(5వ పేజీ తరువాయి)

గురవుతున్నారు. దీంతో తమ డిపోలో కాకుండా సమీపంలో ఉన్న మరో డిపో నుంచి బియ్యం, పంచదార తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముస్లింతాటిచెట్లపాలెంలో ఉన్న కార్డుదారులకు సంబంధించిన డిపో సంఘం ఆఫీస్ రోడ్డులో నిర్వహిస్తున్నారు. దీంతో ముస్లింతాటిచెట్లపాలెం కార్డుదారులు సమీపంలో గల ఇతర డిపోల నుంచి సరుకులు తెచ్చుకుంటున్నారు. కురుపాం మార్కెట్‌లో ఒకే ప్రాంతంలో నాలుగు డిపోలు ఉన్నాయి. నాలుగు షాపులు ఒకేచోట ఉండకూడదని జిల్లా పౌరసరఫరాల అధికారి పలుమార్లు ఆదేశించినా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, డీలర్లు అవేవీ పట్టించుకోవడం లేదు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తరువాత సచివాలయాలకు రేషన్ డిపోలు అనుసంధానం చేశారు. అంటే సచివాలయ పరిధిలోని కార్డుదారులకు అందుబాటులో రేషన్ డిపో ఉండాలి. కొన్నాళ్లు ఈ వ్యవస్థ బాగానే కొనసాగినా, ఎండీయూలు వచ్చిన తరువాత డిపో డీలర్లకు పనిలేకుండా పోయింది. దీంతో డిపోలను మారుమూల ప్రాంతాలకు తరలించేశారు. ఎండీయూల రద్దుతో మరోసారి డిపోల ప్రాధాన్యం పెరిగింది. ఎండీయూ రద్దు నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కార్డుదారులకు అందుబాటులోనే డిపోలు నిర్వహించాలని ఆదేశించారు. అయితే కొందరు డీలర్లు మాత్రం అధికారుల ఆదేశాలు పాటించారు. మరికొందరు యథావిధిగా తమకు అనుకూలంగా ఉండే చోట్ల మాత్రమే డిపోలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోర్టబిలిటీ అవకాశం ఉండడంతో కార్డుదారులు చాలామంది తమకు సమీపంలోని మరో సచివాలయంతో మ్యాప్ అయిన డిపో నుంచి సరుకులు తెచ్చుకుంటున్నారు. దీంతో కొన్ని డిపోల్లో 100 శాతం సరుకుల పంపిణీ జరుగుతుండగా, కొన్ని డిపోల్లో 90 శాతం అంత కంటే తక్కువ శాతం సరుకులు పంపిణీ అవుతున్నాయి. 100 శాతం సరుకులు పంపిణీచేసిన డీలర్లు తమ ప్రాంతంలో ఇంకా కార్డుదారులున్నారని వినతి మేరకు అదనపు కోటా బియ్యం పొందగలుగుతున్నారు. డిపోలు ఒకచోట... కార్డుదారులు మరోచోట ఉన్నప్పటికీ జిల్లాలో ఈ నెల 96 శాతానికిపైగా సరుకుల పంపిణీ జరిగింది. కాగా డిపోలు అందుబాటులో ఉంటే ఎవరికి ఇబ్బంది ఉండదని కార్డుదారులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయమై డీలర్లకు పౌర సరఫరాల శాఖ గత నెలలో నోటీసులు జారీచేసింది. డిపోలు తప్పనిరిగా సచివాలయం/క్లస్టర్‌తో మ్యాపింగ్ అయిన ప్రాంతంలో ఉండాలని ఆదేశించింది. అయినా కొన్ని డిపోలు ఇంకా మార్చుకునేందుకు డీలర్లు ససేమిరా అంటున్నారు. ఇటువంటి డిపోలకు చౌకడిపోల సంఘనేతలు, అధికార పార్టీ నేతలు అండగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యను జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ వద్ద ప్రస్తావించగా సచివాలయంతో మ్యాపింగ్ అయిన చోట మాత్రమే డిపోలు ఉండాలన్నారు. అందుకు భిన్నంగా ఉన్న డిపోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్లాంట్ జీఎంలు

వేడుకగా స్టీల్ క్లబ్ వార్షికోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ స్టీల్ క్లబ్ వార్షికోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ప్లాంట్ జీఎం (యుటిలిటీస్), జీఎం (హెచ్ఆర్) ఎం.మధుసూదనరావులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉన్న ఉద్యోగుల ఆహ్లాదం కోసం క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు విశేషనీయమన్నారు. కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ తమ పాలకవర్గం ఎన్నో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తూ సభ్యులకు ఆహ్లాదాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, వేణుగోపాల్, లక్ష్మీ నరసింహం, కృష్ణయ్య, రమేశ్, భవనకిరణ్, రాజు, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఉన్నత విద్యపై అవగాహన

అగనంపూడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో కేసీ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు హయ్యర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుంధతి మాట్లాడుతూ విదేశాల్లో విద్యావకాశాల గురించి వివరించారు. ప్రముఖ విశ్వ విద్యాలయాల్లో అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, కోర్సుల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

పెదగంట్యాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను న్యూపోర్టు పోలీసులు శనివారం సాయంత్రం అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,67,000 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న ఆటోను సీజ్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు న్యూపోర్టు పోలీసులు గంగవరం రోడ్డులో విశాఖ విమల విద్యాలయం వద్ద కాపు కాశారు. ఆటోలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 860,650 ఎంఎల్ బీర్ బాటిళ్లు 240 స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న సీతానగరం కాలనీకి చెందిన కె.అప్పలరాజు, గంగవరానికి చెందిన వి.శ్రీనివాసరావులను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి సీఐ టి.కామేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

అగనంపూడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆటో డ్రైవర్ జి.కనకరాజు కుటుంబానికి స్థానిక భావన రుషి మార్కండేయ సేవా సంఘం ఆర్థిక సాయం అందించింది. శనివారం బాధిత కుటుంబాన్ని కలిసి రూ.12 వేలతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. సంఘం ప్రతినిధులు గుడే కృష్ణ, సుశీలగజేంద్రరరావు, రాంబాబు, వెంకటరమణ, నరసింగరావు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడి, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 32, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 24, పచ్చిమిర్చి 74, కాకరకాయలు 36, బీరకాయలు 28, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 28, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 54, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	81
లైవ్ ధర	101
విత్ స్కిన్	172
స్కిన్‌లెస్	182

ఉద్రిక్తతకు దారితీసిన షెడ్డు నిర్మాణం

గరుడాద్రిపై ప్లింత్ బీమ్‌ను తొలగించేందుకు యత్నించిన రెవెన్యూ సిబ్బంది

అడ్డుకున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

ఇరు వర్గాల మధ్య ఘర్షణ



తోపులాటలో కింద పడిపోయిన ఆలయ ధర్మకర్త మంజుల

పెదగంట్యాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి గరుడాద్రిపై గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరాలయ ఆవరణలో షెడ్డు నిర్మాణం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. షెడ్డు నిర్మాణానికి గాను ఆలయ కమిటీ ప్రతినిధులు ప్లింత్ బీమ్ వేయగా.. పెదగంట్యాడ మండల రెవెన్యూ సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో జరిగిన తోపులాటలో ఆలయ ధర్మకర్త మంజుల రాళ్లమీద పడిపోవడంతో ఆమె స్పృహ కోల్పోయారు. పలువురు భక్తులు ఆమెకు ఉపచర్యలు చేశారు. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం సరిగ్గా ఆలయ ఆవరణలో అన్న సమారాధన జరుగుతున్న సమయంలో జరిగింది. ప్రతి శనివారం ఇక్కడ అన్న సమారాధన జరుగుతుండడంతో వందలాది మంది భక్తులు వస్తుంటారు. వారంతా ఎండ, వానల్లోనే అన్న ప్రసాదాన్ని తింటుండడంతో ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి నీడ కల్పించేందుకు గాను షెడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఇది ప్రభుత్వ స్థలమని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ ప్లింత్ బీమ్‌ను తొలగించేందుకు రెవెన్యూ సిబ్బంది యత్నించారు. ఆలయ కమిటీ సభ్యులతోపాటు భక్తులు వారిని అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో రెవెన్యూ సిబ్బంది తాత్కాలికంగా తమ ప్రయత్నాలను విరమించి వెళ్లిపోయారు. కాగా రెవెన్యూ సిబ్బంది చర్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు సోమవారం కలెక్టరేట్ వద్ద స్వామీజీలు, హిందూ సంఘాలు, వీహెచ్‌పీ, హిందూ ధర్మ పరిరక్షణ సంఘాలతో ధర్నా చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆలయం పేరుతో ప్రభుత్వ భూమి ఆక్రమణ: తహశీల్దార్

మండలంలోని సర్వే నంబర్-274లో గల కొండ పోరంబోకు భూమిలో ఒక ఆలయం నిర్మించారని, మంత్రి మంజుల మరో తొమ్మిదిమంది ట్రస్టుగా ఏర్పడి దీన్ని నిర్మించారని, ఇప్పుడు మరికొంత స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని పెదగంట్యాడ తహశీల్దార్ అమల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాంబే కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు స్థల పరిశీలన చేశామన్నారు. ఆక్రమణను తొలగించేందుకు వచ్చిన సిబ్బందిని అడ్డుకోవడం భావ్యం కాదన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రధాన ధ్యేయం

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 67వ వార్డు పరిధిలో శనివారం రూ.3.50 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాజువాకను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలకు పూర్తి స్థాయిలో వసతులను కల్పిస్తున్నామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, నాయకులు పల్లా అచ్చిబాబు, కుంచబాబు, జి.గోపి, సింహాచలం, వాసు, అమ్మాజీ, ఖలీమ్, రామలక్ష్మి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పల్లా శ్రీనివాసరావు



ఆటోనగర్‌లో ప్లాస్టిక్ తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ కృష్ణయ్య

ప్లాస్టిక్ రహిత ఏపీ సాకారమే లక్ష్యం కావాలి

ఏపీపీసీబీ చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య

ఆటోనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారమే ప్రతి పౌరుడి లక్ష్యం కావాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. శనివారం ఆటోనగర్‌లో ప్లాస్టిక్ తయారీ యూనిట్లు నవీన్ సాయి ప్లాస్టిక్స్, ప్రగతి ప్రింట్ ప్యాక్స్‌లలో నిర్వహించిన తనిఖీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, నియమాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించడమే తనిఖీల లక్ష్యమన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తి, సరఫరాపై ఆందోళన వ్యక్తం చేశారు. నిర్దేశించిన మందం కంటే తక్కువ మందం కలిగివున్న కవర్లు, ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని, సరఫరాను తక్షణమే నిలిపివేయాలనీ ఆయా యూనిట్ల యజమానులకు ఆదేశించారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్‌కు ఉపయోగిస్తున్న ముడిపదార్థాలు, వ్యర్థాలను పారవేసే పద్ధతులు, రీసైక్లింగ్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను సక్రమంగా ఉపయోగించాలని సూచించారు.

భెల్ హెచ్‌పీవీపీ కార్మికులకు పీపీపీ

రెండు విడతల్లో రూ.30 వేలు చెల్లించేందుకు జేసీసీ తీర్మానం

అక్కిరెడ్డిపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ కార్మికులకు ప్లాంట్ పెర్ఫార్మెన్స్ పేమెంట్ (పీపీపీ) చెల్లించేందుకు భెల్ యాజమాన్యం నిర్ణయించింది. శనివారం ఢిల్లీలో జరిగిన భెల్ జాయింట్ కమిటీ (జేసీఎం) సమావేశంలో పలు నిర్ణయాలను యాజమాన్యం తీసుకుంది. భెల్ కార్మికులకు పీపీపీ కింద రూ.30 వేలు చెల్లించేందుకు నిర్ణయించగా, ఈ నెల వేతనాలతో కలిపి రూ.15 వేలు, మిగతా రూ.15 వేలను దీపావళి సమయంలో చెల్లించేందుకు యాజమాన్యం నిర్ణయించినట్టు కార్మిక నాయకులు తెలిపారు. అలాగే ఆదివారం విధులు నిర్వహించే కార్మికులకు ఓటీ చెల్లించడానికి, లేట్ నైట్ స్నాక్స్ అలవెన్స్ వంటి అంశాలపై సబ్ కమిటీలను వేసి చర్చించి నిర్ణయం తీసుకోవాలని జేసీఎం తీర్మానించినట్టు వారు పేర్కొన్నారు. సమావేశంలో భెల్ చైర్మన్ సదాశివమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'స్టాండింగ్'లో 93 అంశాలకు ఆమోదం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ అభివృద్ధి పనులతో పాటు మార్కెట్ల ఆశీలు, దుకాణాలకు లీజులు, ఉద్యోగుల సర్వీసు విషయాలకు సంబంధించిన 93 అంశాలకు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో శనివారం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన అజెండాలో పొందుపరిచిన 60 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో పొందుపరిచిన 33 అంశాలపై కమిటీ చర్చించి ఆమోదం తెలిపింది. కమిటీ ఆమోదించిన 93 అంశాల్లో రూ.31.03 కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించిందని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీకి ఆదాయం సమకూరే మార్గాలను మరింత అభివృద్ధి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్డులోని సిల్వర్ స్వాన్ రెస్టారెంట్‌కు లీజుకు ఇచ్చిన స్థలాన్ని మార్కింగ్ చేసి, అందులోనే వ్యాపార కార్యకలాపాలు సాగించేలా చూడాలని ఆదేశించారు. పార్కుల్లో ప్రవేశ రుసుములు జీవీఎంసీ గెజిట్‌లో నిర్దేశించినట్టుగానే జరగాలని, ఇందుకోసం పార్కుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని జడ్సీలకు సూచించారు. వర్షాలు ప్రారంభమైనందున నగరంలో దోమల వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ కోసం ఆమోదించిన నిధులను సక్రమంగా వెచ్చించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.నరేశ్‌కుమార్‌కు ఆదేశించారు. సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ఫోన్లతో ఎస్ఐ సూరిబాబు తదితరులు

రూ.5 లక్షల విలువైన 40 ఫోన్లు స్వాధీనం

పెందుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నేర విభాగ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 40 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు క్రైమ్ ఎస్ఐ డి.సూరిబాబు శనివారం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం ఫోన్లు పోయాయని ఫిర్యాదులు అందిన వెంటనే కేసును దర్యాప్తు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. చోరీకి గురైన ఫోన్లను విక్రయిస్తున్న దుకాణం మీద నిఘా పెట్టామని, సీఈఐఆర్ యాప్ ద్వారా డేటా రికవరీ చేశామని చెప్పారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేసిన వారి దగ్గరి నుంచి కూడా రికవరీ చేస్తున్నామని తెలిపారు. ఫిర్యాదుదారులను సీఈఐఆర్ యాప్‌లో తమ ఫోన్ నంబర్ రిజిస్టర్ చేసుకుంటే ఫోన్ చోరీకి గురైనట్టు ఫిర్యాదు నమోదు నమోదవుతుందని తెలిపారు. 24గంటల్లో నంబర్ బ్లాక్ అవుతుందని తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లను సీపీ అందిస్తారని తెలిపారు.

సౌత్ ఏసీపీగా వై.శ్రీనివాసరావు

క్రైమ్ ఏసీపీగా కె.ధర్మేంద్ర

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీలకమైన సౌత్ సబ్ డివిజన్ ఏసీపీగా వై.శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇస్తూ డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సౌత్ ఏసీపీగా పనిచేసిన టి.త్రినాథ్‌ను ఇటీవల డీజీపీ కార్యాలయానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో గుంటూరు రేంజ్‌కు చెందిన వై.శ్రీనివాసరావును నియమించడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గుంటూరుకు చెందిన ఒక ప్రజాప్రతినిధి శ్రీనివాసరావుకు విశాఖ సౌత్ ఏసీపీ పోస్టింగ్ ఇప్పించాలని నగరానికి చెందిన కీలక ప్రజాప్రతినిధిపై ఒత్తిడి చేయడంతో ఆయన డీజీపీకి చెప్పి మరీ పోస్టింగ్ ఇప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశాఖ రేంజ్‌కు చెందిన పలువురు డీఎస్పీలు పోస్టింగ్‌ల కోసం నెలలు తరబడి ఎదురుచూస్తుంటే తమను పరిగణనలోకి తీసుకోకుండా సామాజిక వర్గాల పేరుతో వేరే రేంజ్‌కు చెందిన అధికారికి ఇక్కడ పోస్టింగ్ ఇవ్వడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా నగర క్రైమ్ ఏసీపీగా పనిచేస్తున్న డి.లక్ష్మణరావును టెక్కలి డీఎస్పీగా బదిలీ చేసి ఆయన స్థానంలో కె.ధర్మేంద్రను నియమించారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ర్యాలీ

మల్కాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 61వ వార్డులో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకులు శనివారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, జోన్ నాయకుడు ఉరుకూటి బాబూరావు మాట్లాడుతూ కూటమి నాయకులు స్మార్ట్ మీటర్ల విషయంలో నాడు జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించి, తాము అధికారంలోకి వచ్చాక ఈ ప్రతిపాదనను రద్దు చేస్తామని చెప్పి నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. వీటివల్ల మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

నోట్ పుస్తకాల పంపిణీ

గోపాలపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'సత్యసాయి అమృతం' సంస్థ లక్ష్మీనగర్‌లోని మండల పరిషత్ పాఠశాలలో 94 మంది విద్యార్థులకు శనివారం నోట్ పుస్తకాలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి సంస్థ చేస్తున్న సేవలను హెచ్ఎం ఎస్. ప్రభాకరరావు కొనియాడారు.

పలు వార్డుల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీని చేపడుతున్న దృశ్యం

గోపాలపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ పిలుపునిచ్చారు. దుర్గానగర్‌లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల జలజీవరాశులు చాలా వరకు అంతరించి పోయాయని కాలం గడిచే కొద్ది వాటి మనుగడకే హానీ కలుగుతోందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించి స్వచ్ఛ నగరాల్లో విశాఖను అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపాలెం సీఎస్‌సీఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

మల్కాపురం (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురంలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ శనివారం నిర్వహించారు. ఈ సంద్భంగా మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరీ, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు మాట్లాడారు. ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని, దాని వల్ల పర్యావరణం దెబ్బతింటోందని అన్నారు. ప్లాస్టిక్ వాడకానికి పూర్తిగా స్వస్తి పలికేందుకు ప్రజలు నడుం బిగించాలని కోరారు. ప్లాస్టిక్ బదులు జనపనార, బట్టతో చేసిన సంచులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ మెంబర్ పొత్తబత్తుల శ్రీనివాసరావు, కూటమి శ్రేణులు, ఆర్పీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చినముషిడివాడలో స్వచ్ఛదివస్

పెందుర్తి (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడ సుజాతనగర్ ప్రధాన రహదారిలో స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అంగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత ర్యాలీని ప్రారంభించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

గోపాలపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): నాణెలతో జూదం ఆడుతూ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న 8 మంది జూదరులను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తపాలెం-నరవ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్టు తమకు సమాచరం అందిందని పెందుర్తి సీఐ కేవీ.సతీశ్‌కుమార్ తెలిపారు. వెంటనే టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహాయంతో సంయుక్తంగా దాడులు నిర్వహించామని తెలిపారు. అరెస్టు చేసిన 8 మంది నుంచి రూ.39,100 నగదు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రూ 1.4 లక్షల విరాళం

పెందుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వెంకటాద్రి ఆలయం లో సోలార్ ప్లాంట్ నిర్మాణం కోసం ఎన్ఆర్ఐ ముక్కు గౌతమ్ రూ. 1.40 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ నిధులతో ఆలయంలో 3 కిలోవాట్స్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయనున్నారు. శనివారం గౌతమ్ తల్లిదండ్రులు వెంకన్నను దర్శించుకుని, చెక్‌ను ఆలయ అధికారులకు ఇచ్చారు.



చెక్కును అందజేస్తున్న నాగేశ్వరావు దంపతులు

సూర్యదేవర యజ్ఞం ప్రారంభం

పెందుర్తి, జూలై 19 (ఆంధ్రజోతి): లోక సుభిక్షాన్ని ఆకాంక్షిస్తూ 'శుక్ల యజుర్వేద స్మార్త అభివృద్ధి సంఘం' పురోహితుల ఆధ్వర్యంలో సూర్యయజ్ఞ వల్క్య ఆలయంలో శనివా రం యజ్ఞం ప్రారంభమయింది. ఈ సందర్భంగా సూర్యదేవర విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న యాగశాలలో అర్చకు లు యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ఉదయం 10 గం టలకు నిర్వహించే పూర్ణాహుతితో యజ్ఞం ముగయనున్నది.